పెద్దతూప్రలో ఇంటింటి సర్వే ప్రారంభం



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక్

శంషాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీలో భాగంగా మండలంలోని పెద్దతూప్రలో ఇంటింటి సర్వేను గురువారం ప్రారంభించారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామంలో మూడు బృందాలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శశాంక్ సర్వే తీరును పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



వివేకానంద కాలనీలో వైభవంగా బతుకమ్మ వేడుకలు

శంషాబాద్: పట్టణంలోని వివేకానంద కాలనీలో హిందూ వికాస్ గణేష్ ఉత్సవ సమితికి చెందిన బతుకమ్మ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో బీజేపీ నాయకురాలు మాధవి లత హాజరై రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మతో ఆడారు. ఈ కార్యక్రమంలో హిందూ వికాస్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలి



ఎమ్మెల్యే కౌసర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చేలా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కాయకల్ప్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు గురువారం ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైద్యులు సూపరింటెండెంట్ సారథ్యంలో బాగా పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి నూతన భవనానికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని మరి కొన్ని నెలల్లో ఆసుపత్రికి అదనపు భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్య శాఖ అధికారులు సైతం పలుమార్లు ఆసుపత్రిని సందర్శించి వైద్యుల సేవలను, ఆసుపత్రి పనితీరును మెచ్చుకున్నారన్నారు.

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వెంకటరమణ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వెంకటరమణ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉప్పల్ సర్కిల్‌లో పనిచేసిన ఆయనకు శేరిలింగంపల్లి సర్కిల్ పోస్టింగ్ ఇవ్వడంతో విధుల్లో చేరారు. ఇప్పటి వరకు పని చేసిన డిప్యూటీ సిటీ ప్లానర్ మెహ్రాకు ఫలక్‌నామా సర్కిల్‌కు బదిలీ చేశారు. అదే విధంగా టీపీఎస్‌గా జిషాన్ విధుల్లో చేరారు.

పర్షియన్, సంస్కృత భాషలకు ప్రాధాన్యం



రాయదుర్గం: మొఘలులు పర్షియన్, సంస్కృత భాషలను సమానంగా ప్రోత్సహించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని ఢిల్లీ విశ్వవిద్యాలయం చరిత్ర ప్రొఫెసర్ ఫర్హత్‌హసన్ గుర్తు చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'చరిత్ర, ముస్లిం చరిత్రకారులు: భారతీయ దృక్పథం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధిలో అత్యంత ముఖ్యమైనది అక్షరాస్యతను విస్తరించడం, ప్రోత్సహించడమని గుర్తు చేశారు. అనంతరం ప్రొఫెసర్ ఫహీమ్ అక్తర్ నద్వీ సంపాదకత్వం వహించిన ఇటీవలి సెమినార్‌ల ప్రొసీడింగ్స్‌ను ప్రొఫెసర్ ఫర్హత్‌హసన్ విడుదల చేశారు. ఇదిలావుండగా ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సెమినార్ పేపర్లను ప్రచురించమని డిపార్ట్‌మెంట్‌ను ప్రోత్సహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, డాక్టర్ అతీఫ్ ఇమ్రాన్ ప్రసంగించారు. పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, చరిత్రకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని గాంధీబొమ్మ వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా భాగ్యనగర్ జిల్లా, గౌలిపురా డివిజన్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి, కార్యాలయం ఇన్‌చార్జి ప్యారసాని వెంకటేష్ పాల్గొని సభ్యత్వాలను అందజేశారు. ఓబీసీ మోర్చా కార్యదర్శి మోకాళ్ల వెంకటేష్, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ శేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి మల్లేష్, శ్రీనివాస రామాపురం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు విజయ కుమార్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, ప్రేమ్ కుమార్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు సాయి కుమార్ పాల్గొన్నారు.

రూ. 20 లక్షల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకు సిద్ధం

- తీరనున్న తాగునీటి కష్టాలు
- త్వరలో మరో రెండు మిలియన్ లీటర్ల నీటి సరఫరా
- కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకులోకి ట్రయల్ రన్ పూర్తి
- నెలరోజుల్లోపు ప్రారంభించేందుకు సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన ఓవర్‌హెడ్ ట్యాంకు

శంషాబాద్: అరకొర నీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్న శంషాబాద్ పట్టణ ప్రజలకు మంచినీటి కష్టాలు తీరేందుకు మార్గం సుగమమవుతోంది. పట్టణ జనాభాకు అనుగుణంగా సరైన నీటి సరఫరా లేకపోవడంతో నానాఅగచాట్లు పడుతున్నారు. పట్టణానికి ప్రతి రోజు ఐదు మిలియన్ లీటర్ల నీటి సరఫరా అవసరం ఉండగా, ప్రస్తుతం నాలుగు మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే మెట్రోవాటర్ బోర్డు సరఫరా చేస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు మెట్రోవాటర్ బోర్డు పట్టణంలోని హుడా కాలనీలో కొత్తగా నిర్మాణం చేసిన ఇరవై లక్షల నీటి సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు సిద్ధమైంది. ఇప్పటికే పలుమార్లు ట్రయల్‌రన్ కూడా పూర్తి చేశారు.

భారీ ఎత్తున అక్రమ నల్లాలు

ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిధిలోని పట్టణ ప్రాంతానికి హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా జరుగుతోంది. హెచ్ఎండబ్ల్యూఎస్ రికార్డు ప్రకారం ప్రస్తుతం గృహ, వాణిజ్య నల్లా కనెక్షన్లు మొత్తం 7 వేల నల్లా కనెక్షన్లున్నాయి. ఒక్కో నల్లా కనెక్షన్‌కు ప్రతి రోజు రికార్డు ప్రకారం 500 లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పట్టణంలో ధర్మగిరి వద్ద ఉన్న రిజర్వాయర్ సామర్థ్యం 3 వేల మిలియన్ లీటర్లు. దీంతో రోజుమార్చి రోజు హెచ్ఎండబ్ల్యూఎస్ 7వేల కనెక్షన్లకు నీటి సరఫరా చేస్తోంది. ప్రతి రోజు 5 వేల మిలియన్ లీటర్లు అవసరం ఉన్నప్పటికీ కేవలం 4 వేల మిలియన్ లీటర్లు మాత్రమే సరఫరా అవుతున్నాయి. సుమారు 4వేల వరకు అక్రమంగా ఉన్న నల్లా కనెక్షన్లతో అధికారిక కనెక్షన్లు ఉన్న వారికి సరైన నీటి సరఫరా చేసే పరిస్థితి లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. వీటిని క్రమబద్ధీకరించుకుంటే నీటి సరఫరా పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకుతో..

హుడా కాలనీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా పట్టణంలోని జాతీయరహదారికి ఒకవైపు ఉన్న పూర్తి ప్రాంతాలకు మెరుగైన నీటి సరఫరా సాధ్యమవుతుందనే అంచనాలున్నాయి. దీనికి 20లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యముంది. ఈ ట్యాంకు ప్రారంభానికి ముగింపు దశలో చిన్న చిన్నపనులతో పాటు రహదారి బాగు చేసుకోవాల్సిన సమస్య ఉందని కాబట్టి ఈ నెలాఖరులోపు లేదా వచ్చేనెల మొదటి వారంలో ప్రారంభించేందుకు అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

మరో నెలలో..

మరో నెల రోజుల్లో హుడా కాలనీలో ఏర్పాటు చేసిన 20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే ట్రయల్ పూర్తి చేశాం. చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. ట్యాంకు ప్రారంభంతో మెరుగైన నీటి సరఫరాకు మార్గం సుగమమవుతోందని అనుకుంటున్నాం.

–హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్, హసీనా

పేదవారికి ఉచిత కనెక్షన్ ఇవ్వాలి



ప్రభుత్వం పేదవారందరికి జీహెచ్ఎంసీలో మాదిరిగా ఉచితంగా నీటిని అందించాలి. పట్టణంలో అర్హులైన పేద కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి. వారికి ఉచిత నీటి కనెక్షన్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరైన నీటి సరఫరా లేకున్నా బిల్లుల మోతమోగుతున్నాయి. నీటి సరఫరా తీరును మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలి.

– శంషాబాద్, తోకల మురళి

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



శంషాబాద్: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర దేవాలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారిని తొలిరోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా తులసి దళంతో ఆకుపచ్చ వర్ణంలో అలంకరించారు. అనంతరం విష్ణు సహస్రనామం, పారాయణం, నిత్య హోమం, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తజనం స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు వివేకానంద గుప్తా, చింతల రామకృష్ణ గుప్తా తదితరులు పర్యవేక్షించారు.

దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న అన్ని సమస్యలకూ దశలవారీగా పరిష్కారం చూపుతామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను వివరించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి గురువారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ... అన్ని రంగాలలో గచ్చిబౌలి డివిజన్‌ను అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా మార్చాలనే సంకల్పంతో పనిచేద్దామని సూచించారు. మంచి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన నీటి సరఫరా చేయాలని, అవసరమైన చోట మంచినీటి సరఫరా సమయం పెంచేలా చూస్తామన్నారు. బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హన్మంతునాయక్, నాయకులు జలేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వినోద్, అశోక్‌గౌడ్, యాదగిరి, వినోద్ రావు, నకుల్, దొరబాబు, శేఖర్, ప్రసాద్, సుమన్, ప్రకాశ్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

ఇళ్ల అప్పగింత తరువాతే కూల్చివేతలు: మంత్రి శ్రీధర్‌బాబు



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: మూసీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలకు అండగా ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరామ్, ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూసీ సుందరీకరణ విషయమై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రివర్‌బెడ్‌లో అధికారులు రెండు నిర్మాణాలను గుర్తించారన్నారు. అలాగే అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతంలో కొన్ని ఇళ్లను గుర్తించి వాటికి అధికారులు మార్కింగ్ చేశారన్నారు. ప్రజలు అబద్ధపు మాటలు నమ్మి మోసపోవద్దని, ఏ ఒక్కరికి నష్టం జరగదని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన అన్నీ వసతులతో కూడిన ఇళ్లను అందించిన తరువాతే రివర్‌బెడ్‌లో ఉన్న నిర్మాణాలను కూల్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఇప్పటికే పలువురికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లతో పాటు వారి ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయలను అందిస్తున్నామన్నారు. ప్రజలకు మంచి చేసేందుకు రివర్‌బెడ్‌లో ఉన్న నిర్మాణాలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలు తమ పూర్తి మద్దతుతో వచ్చినప్పుడే వారికి ప్రత్యామ్నాయ ఇళ్లను అందించి రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాలను తొలగిస్తామన్నారు.

బుల్కాపూర్ నాలాలో రోడ్డు నిర్మాణం



బుల్కాపూర్ నాలాలో కొనసాగుతున్న రోడ్డు పనులు

మణికొండ: ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, నాలాల్లో వచ్చిన నిర్మాణాలను తొలగించి వాటిని పునరుద్ధరిస్తుంటే మరో వైపు మణికొండలో ఏకంగా వాటిని పూడ్చి రోడ్లు, భవన నిర్మాణాలు చేపడుతున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని బీరప్ప దేవాలయం ముందు ఓ ప్రైవేటు లేఅవుట్ ఉంది. దానికి అటు వైపుగా రోడ్డు ఉండగా వెనక వైపు ఏకంగా బుల్కాపూర్ నాలాను పూడ్చి మరో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. దీంతో స్థానికులు నాలాను పరిరక్షించాలని, అందులో వచ్చిన ఇంటి నిర్మాణాలతో పాటు రోడ్డును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని వారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, గురువారం వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారని వారు వెల్లడించారు. గురువారం చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించటంతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మణికొండ వాసులు తెలిపారు.

నీటి సరఫరా సమస్యను తీర్చండి



ఖిజ్రా కాలనీలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: ఎత్తైన ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని, నిరుపయోగంగా ఉన్న బూస్టర్‌లను వెంటనే పరిశీలించి సమస్యను తీర్చాలని బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం, వర్కింగ్ అధ్యక్షుడు ధన్‌రాజ్ డిమాండ్ చేశారు. పార్టీ తరఫున గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఖిజ్రా కాలనీ, డాలర్స్‌హిల్స్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలకు సరిపడా నీటిని సరఫరా చేసేందుకు బూస్టర్‌లు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ వాటికి అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించటంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఖిజ్రా కాలనీలో మసీదు కొరకు వేసిన బోరును ప్రైవేటు వ్యక్తులు వినియోగిస్తున్నా.. మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి బోరును మసీదుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు మహమ్మద్ ఖలీం, షేక్ ఆరీఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన దసరా నవరాత్రులు



పుప్పాలగూడలో అమ్మవారి పూజల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



ఖానాపూర్‌లో అమ్మవారి పూజల్లో భక్తులు

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పలు మండపాలలో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పారు. మణికొండ భాగ్యలక్ష్మి కాలనీలోని దుర్గామాత ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. పుప్పాలగూడలో జరిగిన మొదటి రోజు ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



ధర్మగిరి దేవాలయంలో స్వర్ణకవచ దుర్గాదేవీ అలంకరణలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో బుద్వేల్ కోట మైసమ్మ అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలు...

మరోవైపు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆలయాలతో పాటు ఆయా ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. బుద్వేల్‌లోని కోట మైసమ్మ దేవాలయంలో తెల్లవారుజామునే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు...

శంషాబాద్‌లో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ధర్మగిరి దేవాలయంలో అమ్మవారిని స్వర్ణకవచ దుర్గాదేవీగా అలంకరించారు. ఈ సందర్భంగా నిత్య హోమాన్ని ప్రారంభించి కుంకుమార్చన, పారాయణం నిర్వహించారు. ఊట్‌పల్లిలోని శృంగేరి శంకరమఠంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. నాగలింగేశ్వరాలయంలో పసుపు వర్ణంతో కూడిన చీరతో బాలాత్రిపురసుందరీగా అలంకరించి పూజలు చేశారు. గణపతి, గౌరి పూజ, నవగ్రహారాధన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు.



ఉప్పర్‌పల్లిలో అమ్మవారి పూజల్లో భక్తులు



హైదర్షాకోట్ వినాయక ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

టీఎఫ్‌సీఓ మహిళా విభాగాన్ని పటిష్టం చేయాలి

గోల్కొండ: తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ మహిళా విభాగాన్ని పటిష్టం చేయాలని ఉమ్మడి తెలుగు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ ఆయేషా బేగం అన్నారు. గురువారం ఆమె టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీవో కార్యాలయంలో మహిళా విభాగం ఏర్పాటు కోసం చైర్మన్ మహ్మద్ నజీబ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి జిల్లాకు టీఎఫ్‌సీఓ మహిళా అధ్యక్షురాలును నియమించి వాటిలో చురుకైన యువతులను కౌన్సిలర్లుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీఓ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహద్ ఉన్నారు.



మహ్మద్ నజీబ్‌తో రాష్ట్ర మాజీ మహిళా కమిషన్ చైర్మన్ ఆయేషా బేగం

లాయర్‌పై పోలీసుల దాడి.. న్యాయవాదుల నిరసన



కోర్టు ఆవరణలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

రాజేంద్రనగర్: మూసీ నిర్వాసితులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లును గతంలోనే తమకు కేటాయించారని.. కొంతమంది బాధితులు కోర్టును ఆశ్రయించారు. అయితే బాధితుల తరఫున న్యాయవాది కలీమ్ కోర్టులో వాదోపవాదనలు చేస్తున్నారు. అయితే కలీమ్‌ను టార్గెట్ చేసిన పోలీసులు అతని ఇంట్లోకి వెళ్లి దాడి చేశారు. అంతటితో ఆగకుండా ఓ వాహనంలో ఎక్కించుకొని బయటికి తీసుకెళ్లి హింసించారు. అసభ్యకరమైన పదజాలంతో తనను దూషించారని బాధిత న్యాయవాది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కలీమ్‌పై దాడికి పాల్పడ్డ మాదన్నపేట్ పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. గురువారం ఉప్పర్‌పల్లి కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో ధర్నాకు దిగి నిరసన తెలిపారు. దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉప్పర్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గత కొంతకాలంగా న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కలీమ్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని లాయర్లు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ తులసీరామ్, కృష్ణ యాదవ్, ఖలీల్, శ్రీనివాస్ నాయుడు, సిద్దేశ్వర్, జ్ఞానేశ్వర్ చారి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.